క్లుప్తంగా

మాజీ సర్పంచి విగ్రహానికి క్షీరాభిషేకం



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో మాజీ సర్పంచ్ చక్రపాణి 9వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. తొలుత చక్రపాణి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి గ్రామానికి, పార్టీకి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఆయన కుమారుడు కొల్లి మురళి, మండలి వెంకట్రామ్, దివి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరావు, చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరు దిలీప్‌కుమార్, సీడీసీ మాజీ చైర్మన్ రావి నాగేశ్వరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు పాల్గొన్నారు.

టైలర్స్ నాయకుడు కోటేశ్వరరావు మృతి

నాగాయలంక: నాగాయలంకలో టైలర్స్ నాయకుడిగా ప్రాచుర్యం పొందిన బీజేపీ సీనియర్ కార్యకర్త ఎస్.కోటేశ్వరరావు (75) అనారోగ్యంతో బుధవారం మరణించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నాగాయలంకలో టైలర్స్ యూనియన్ సీనియర్ నేతగా ఆయన దర్జీల సమస్యలు పరిష్కరించారు. మండల బీజేపీ నాయకులు చన్నగిరి లతామోహన్, గుడివాక శివాజీ తదితరులు, పలువురు టైలర్స్, స్థానిక ప్రముఖులు కోటేశ్వరరావు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆరాధనా మహోత్సవం

చల్లపల్లి: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనా మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తెల్లవారు జామున అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక నగదు అందజేత

చల్లపల్లి: ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక విజయ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని బళ్ళా నాగసాయి కీర్తనకు హేమాద్రి వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ హేమాద్రి రజాక్ బుధవారం రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. 600 మార్కులకు గాను 574 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో నాగసాయి కీర్తన ప్రథమ స్థానంలో నిలిచింది.

సాంఘిక సంక్షేమశాఖ డీడీకి సన్మానం



చిలకలపూడి(మచిలీపట్నం): పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహెద్‌బాబును సన్మానించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో 26 జిల్లాల్లో కృష్ణాజిల్లాలో 134 మంది పరీక్షకు హాజరుకాగా 127 మంది ఉత్తీర్ణత సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన షాహెద్‌బాబును సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డి. బాలవీరాంజనేయ స్వామి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం.నాయక్, డైరెక్టర్ ఎం.లావణ్యవేణి చేతుల మీదుగా మెరిటోరియస్ అవార్డును అందుకున్నారు.

11న కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ విద్యా నికేతన్ డిజటల్ స్కూలు ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. సంబంధిత రోగులు నేత్ర వైద్య పరీక్షలు, ఇతర వివరాల కోసం మొబైల్ నంబర్లు 94906 36466, 70936 17778లలో సంప్రదించి పేర్లు ముందుగా నమోదు చేసుకోవచ్చన్నారు. వైద్య పరీక్షల్లో శుక్లాలు నిర్ధారణ అయినవారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్ (ఐఓఎల్ శస్త్రచికిత్స) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

నేటి నుంచి మాధవస్వామి బ్రహ్మోత్సవాలు

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతా యని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ తెలిపారు. రోజు వారీ కార్యక్రమాలను ఆయన వెల్లడించారు. 13న పవళింపు సేవలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

ప్రతికూల పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి



బాంబుల దాడి జరిగినపుడు అప్రమత్తతపై ప్రాక్టీస్ చేయిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు

- బందరు ఆర్డీవో స్వాతి
- పౌరుల రక్షణకు మాక్ డ్రిల్ నిర్వహణ

కోనేరుసెంటర్: యుద్ధంలాంటి ఉపద్రవాలు సంభవించినప్పుడు భయాందోళనకు గురి అప్రమత్తంగా, మనోధైర్యంతో నిర్ణయాలు తీసుకోవాలని బందరు ఆర్డిఓ కె.స్వాతి సూచించారు. బందరు మండలం తాళ్ళపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సివిల్ డిఫెన్స్ (పౌరుల రక్షణ) సిబ్బంది బందరు ఆర్డీవో స్వాతి ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. అనుకోని అపాయాలప్పుడు ప్రజలు ఎలా ప్రవర్తించాలి, ఏమేమి జాగ్రత్తలు పాటించాలి అనే విషయంపై ఎన్‌డీఆర్ఎఫ్, బెల్, ఎన్‌సీసీ సిబ్బంది ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనల మేరకు తాళ్లపాలెంలో మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం దుర్ఘటన నేపథ్యంలో అనుకోని పరిస్థితులలో గాల్లో నుంచి దాడులు సంభవిస్తే ప్రజల ప్రాణాల రక్షణ విషయంపై మాక్ డ్రిల్ ఏర్పాటు చేశామన్నారు. సైరన్ మోత విన్న వెంటనే అప్రమత్తం కావాలని అది ప్రమాద సూచనగా భావించి ఇంట్లో ఉన్న వారు ఇంట్లోనే ఉండి, బయట ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. కిటికీలు, తలుపులు, మూసివేసి వాటి దగ్గర ఉండరాదన్నారు. ఇంట్లో దీపాలు, సెల్ ఫోన్లు, బ్యాటరీలు, టీవీలు అన్నీ ఆఫ్ చేసి ఉంచాలని లేకుంటే శత్రుదేశం డ్రోన్లు పసిగడతాయన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ అవతార్, జిల్లా విపత్తులు, అగ్నిమాపక అధికారి ఏసురత్నం, సీఐ పరమేశ్వర్, ఎన్‌సీసీ అధికారులు రహమతుల్లా, యాదవ్, పలువురు తహసీల్దారులు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీసు శాఖల అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక డ్వాక్రా మహిళలు, తదితర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ గీతాంజలిశర్మ

కోనేరుసెంటర్: దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ పాలకులపై మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాట పటిమను పోలీసులు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు పేర్కొన్నారు. మన్యం దొర అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సీతారామరాజు చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం, అతి చిన్న వయసులోనే దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన మహావీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. తెల్ల దొరల దోపిడీని ఎదుర్కొని అమాయకులైన గిరిజనులకు అండగా నిలిచిన అల్లూరి సీతారామరాజు అందరి హృదయాల్లో మహావీరుడిగా నిలిచిపోయారన్నారు. సాయుధ పోరాటం ద్వారానే భారతదేశానికి స్వాతంత్రం సిద్ధిస్తుందని నమ్మిన అల్లూరి ఆ మార్గంలోనే తెల్ల దొరలను గడగడలాడించారన్నారు. తెల్లదొరల దోపిడీని అంతమొందించేందుకు ఎనలేని పోరాటం చేసిన ఆయన తన 27 ఏళ్ల ప్రాయంలోనే ప్రాణాలను కోల్పోయారన్నారు. ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని బాధితుల పక్షాన నిలబడి వారికి న్యాయం చేసేందుకు పోలీసులు నిరంతరం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వీవీ నాయుడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, బందర్ డీఎస్పీ సీహెచ్ రాజా, సీఐలు ఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పించిన జేసీ

చిలకలపూడి(మచిలీపట్నం): విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ మన్యం ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత పోరాటపటిమతో ముందుకు రావాలన్నారు. డీఆర్వో కె. చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల కేవీకేలో..

ఘంటసాల: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం మరువలేమని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల కేవీకేలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు చిత్రపటానికి శాస్త్రవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాంబ జన్మదిన వేడుక



కోడూరులో అమ్మవారి ఊరేగింపులో మహిళలు

నాగాయలంక: వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకుని స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకన్యకాంబ జన్మదినోత్సవం వైభవోపేతంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు నేతృత్వంలో 108 లీటర్ల ఆవు పాలతో కన్యకాంబ మూలవిరాట్, ఉత్సవమూర్తులకు అర్చకుడు కొల్లిపర సుబ్బారావు పంచామృతం, పసుపు, కుంకుమ, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకుడు అభిషేక పూజలు చేయగా, ఉత్సవమూర్తికి ఆర్యవైశ్యులు, గ్రామస్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. పూజా క్రతువులో కొల్లూరు మురళీకృష్ణ, హిమబిందు దంపతులు పీటలపై కూర్చున్నారు. అనంతరం శ్రీవాసవీ సేవాదళ్ సభ్యుల నేతృత్వంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ఉంచి కృష్ణానది వరకు ఊరేగింపు చేశారు. కృష్ణానదిలో అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా 102 మంది మహిళలచే కృష్ణానదిలో విహారం చేసిన అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా దీపాల హారతి ఇచ్చారు. దేవాలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చి ఆలయంలో అమ్మవారికి సామూహిక దీపసమర్పణ, కేక్ కటింగ్ కార్యక్రమాలు జరిపారు. చిట్టా శివ నాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, ఆకుతోట సీతారామయ్య, చిట్టా వీరఅన్నపూర్ణయ్య, మానేపల్లి శ్రీనివాసరావు, జల్లూరి ప్రకాష్, సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవాసవీమాతకు లక్ష మల్లెల పూజ

చల్లపల్లి: శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం లక్ష మల్లెలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పొట్టిశ్రీరాములు వీధిలోని ఆర్యవైశ్య భవనం నుంచి పెదకళ్లేపల్లి రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వరకూ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పల్లకీ సేవ, శ్రీవాసవీ మహిళా మండలి వారు 58 రకాల పూలు, పండ్లను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఆలయ అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారి అభిషేకాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి లక్ష మల్లెలతో పూజలు చేశారు. వాసవీ మహిళా మండలి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నమోస్తుతే.. కన్యకాపరమేశ్వరి..!

కోడూరు: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. కోడూరులోని దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖుడు దేసు మల్లిఖార్జున రావు– నాగలక్ష్మి గృహం వద్ద నుంచి అమ్మవారికి పట్టుచీర, పసుపు, కుంకుమ, గాజులు, సారెను మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై ఊరేగించి, స్థానిక శివరామకృష్ణ క్షేత్రంలో పూజలు చేశారు. అమ్మవారికి సారెను సమర్పించి, లలిత సహస్రనామ పారాయణాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉత్సవమూర్తికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలను చేశారు. ప్రోగ్రామ్ కమిటీ ఆర్గనైజర్లు బూరగడ్డ హరినాథ్ బాబు, మద్దాళి ప్రసాద్‌లు పర్యవేక్షించారు.



లక్ష మల్లెలతో పూజలందుకున్న వాసవీ అమ్మవారు



కన్యకాపరమేశ్వరి మూల విరాట్‌కు అభిషేకాలు చేస్తున్న అర్చకులు

పెడన: స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలోని శ్రీవాసవి మాత జయంతోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం ప్రారంభమయ్యాయి. 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాలు పట్టణ, మండల, యువజన ఆర్యవైశ్య సంఘాలు, శ్రీ వాసవి మహిళా మండలి, వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన శాఖల తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పట్టణ అర్యవైశ్య సంఘ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) వివరించారు. పట్టణ అర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షుడు తమ్మన సుబ్బారావు కుటుంబ సభ్యులు లలితాశంకర్, అన్నపూర్ణ దంపతులచే తొలుత గోపూజా, హోమాలను భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రధాన అర్చకులు సాయిబాబు నిర్వహింపజేశారు. అనంతరం అమ్మవారికి మొదటి రోజున అమ్మవారికి 108 లీటర్ల ఆవుపాలతో పాటు 21 ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సభ్యులు సాయంత్రం అమ్మవారి ఆలయ ఆవరణలో లలిత పారాయణ సౌందర్యలహరి, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి చరిత్ర చదివి భక్తులకు వినిపించారు. పెడన పట్టణ మండల పరిసర ప్రాంత ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు సంఘ నాయకులు, సభ్యులు, ప్రతినిధులు తీర్థప్రసాదాలను అందజేశారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన జేసీ



వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పోర్ట్ రోడ్‌లో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ గీతాంజలి శర్మ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ శిబిరంలో ఏ అంశాలపై తర్ఫీదుఇస్తున్నది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులను ఆమె సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేసవి శిబిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఉప గ్రంథాలయ అధికారి ఎంవీడీటీ నగేష్ జేసీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీటీయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు

ఘంటసాల: ఘంటసాల, కొడాలి గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడాలి గ్రంథాలయంలో అధికారి ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్, లూడో, చెస్ ఆటలు ఆడించారు. ఘంటసాల గ్రంథాలయంలో అధికారి శరత్ కుమార్ ఆధ్వర్యంలో ఇంగ్లిషు గ్రామర్ తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ ఐసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



ఏపీ ఐసెట్ ప్రవేశ పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ ఐసెట్–2025 ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన ఉదయం సెషన్‌లో 152 మందికి గాను 147 మంది హాజరయ్యారని, ఐదుగురు ఆబ్సెంట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 152 మందికి 145 మంది హాజరవ్వగా ఏడుగురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్లకు కలిపి 304 మందికి గాను 292 మంది హాజరయ్యారని తెలిపారు.

సమ్మె నోటీసు అందజేసిన మున్సిపల్ కార్మికులు



మున్సిపల్ మేనేజర్ రాజాకు సమ్మె నోటీసును అందజేస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

పెడన: పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మెకు దిగనున్నట్లు బుధవారం మున్సిపల్ మేనేజర్ ఎం.రాజాకు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పెడన శాఖ అధ్యక్షుడు నందమూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు సమ్మెకు దిగుతున్నామన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఒప్పంద కార్మికులను పర్మినెట్ చేయాలని, ప్రభుత్వ రంఘ సంస్థలను పరిరక్షించాలని తదితర డిమాండ్లతో పాటు స్థానిక డిమాండ్లు కూడా పరిష్కరించాలని కోరుతున్నామని తెలిపారు. మచిలీపట్నం డివిజన్ సీఐటీయూ నాయకులు బూర సుబ్రమణ్యం, పెడన సంఘ నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



పీహెచ్‌సీలో డాక్టర్ అనితతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ట

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ శర్మిష్ట బుధవారం ఆకస్మికంగా తనఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ శ్రీకాకుళం పీహెచ్‌సీలోని వైద్య సదుపాయలు, రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరు, పేషెంట్ల గదులు, వడ దెబ్బ తగిలి చికిత్స తీసుకునే రోగులకు కొరకు ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక బెడ్లను, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. రికార్డులను తనఖీ చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ శర్మిష్ట మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్య అధికారులు, సిబ్బందికి డీఎంహెచ్ఓ శర్మిష్ట సూచించారు. శ్రీకాకుళం పీహెచ్‌సీ డాక్టర్ జె.అనిత, జి.వెంకటేశ్వర్లు, వాణిశ్రీ, రత్న కుమారి, స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో బలిహరణ

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం బాలా త్రిపురసుందరీ సమేత గోకర్లేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామ బలిహరణను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో బలిహరణ స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఉదయం హోమలను జరిపారు. బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమార్చనను నిర్వహించి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఈఓ సుధాకర్ తెలిపారు.

వేతనం పెంపుపై హర్షం

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం కల్యాణ కట్టలో క్షురకులుగా పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం రూ.20 వేల నుంచి 25 వేల వరకు వేతనం పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం దేవస్థానం ఎదురుగా పాలాభిషేకం నిర్వహించి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు నాయీ బ్రాహ్మణ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

కోడూరు: మండలంలోని వి.కొత్తపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ సహకారంతో నాంది కమ్యూనిటీ ఐ ప్యూర్ సంస్థ ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్‌ను గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) ప్రారంభించారు. నాంది కమ్యూనిటీ సంస్థ దేశంలోని ఏడు రాష్ట్రాల్లో 650కు పైగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని నిర్వాహకులు తెలిపారు. సర్పంచి యలవర్తి నాంచారయ్య, నీటి సంఘం అధ్యక్షుడు రేపల్లె రవీంద్ర, ప్లాంట్ సేల్స్ ఏజీఎం సీహెచ్.శ్రీనివాసరవు, ప్రాజెక్టు సీతఈఓలు తుంగల రామాంజనేయులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడితే అరెస్టులా?

సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు

మచిలీపట్నంటౌన్: పేదలకు చెందాల్సిన ప్రభుత్వ మిగులు భూములు అభివృద్ధి పేరుతో పారిశ్రామిక వాడకు కేటాయించకుండా భూమిలేని పేదలకు పంచాలని అడిగిన వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఒడుగు గంగాధర ప్రసాద్, ముళ్ళపూడి విల్సన్‌లతో పాటు ఇద్దరు గ్రామస్తులను అరెస్ట్ చేసి గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్లో నిర్బంధించడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు తీవ్రంగా ఖండించారు. బుధవారం కామ్రేడ్ మధుసూదన్ రావు శ్రామిక భవనంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పామర్రు మండలం అయినంపూడి గ్రామంలో సుమారు 11 ఎకరాల పొలం భూ సంస్కరణ చట్టం ప్రకారం మిగులు భూముల జాబితాలో ఉండి, కొంతమంది భూస్వాములు ఏళ్ల తరబడి అక్రమంగా అనుభవిస్తున్నారన్నారు. అనేక ఏళ్లుగా సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఉన్న భూమిలేని పేదలకు పంచాలని పోరాటాలు చేస్తున్నామన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎంపీ తదితర ప్రజాప్రతినిధులు అధికారులు ఐనంపూడి భూముల్లో పారిశ్రామిక వాడ ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తుండగా, అదే గ్రామంలో నివసించే పేదలకు మిగులు భూములు పంచాలని ఆందోళన చేపట్టిన గ్రామ పేదలను నిర్బంధించి, వారికి మద్దతుగా నిలిచిన వ్యవసాయ కార్మిక సంఘం నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు భూమి పంచాలని నరసింహారావు కోరారు.

ఆర్టీసీ సర్వీసు అమలాపురం వరకు పొడిగింపు

అవనిగడ్డ: నాగాయలంక నుంచి నరసాపురం నడుపుతున్న అవనిగడ్డ ఆర్టీసీ డిపో సర్వీసుని అమలాపురం వరకు పొడిగించినట్టు డీఎం కె. హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంక నుంచి ఉదయం 6.50కి బయలు దేరే ఈ సర్వీసు మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను, భీమవరం, పాలకొల్లు, రాజోలు, అమలాపురం వరకు వెళుతుందని చెప్పారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు బయలు దేరి నాగాయలంక నుంచి అవనిగడ్డ వస్తుందన్నారు. ప్రయాణికులు ఈ సర్వీసుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెళ్లి చేసుకుంటానని గర్భవతిని చేసిన వ్యక్తిపై కేసు

చల్లపల్లి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని గర్భవతిని చేసిన ఘటన మండల పరిధిలోని లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు.. ఒంగోలుకు చెందిన యాటగిరి సాయికుమార్(23) కృష్ణా జిల్లా చల్లపలి మండలం లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న తన బంధువు ఇంటికి వచ్చి వెళుతూ ఉండేవాడు. బంధువు కూతురితో సన్నిహితంగా ఉంటూ పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. చివరికి ఆ యువతి గర్భం దాల్చింది. అయితే ఆమెను పెళ్లి చేసుకునేందుకు సాయికుమార్ నిరాకరించటంతో వారు చల్లపల్లి పోలీస్టేషన్లో బుధవారం ఫి ర్యాదు చేశారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఎం అనుబంధ కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం కౌలు రైతులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే నగదు సహాయం నేరుగా వారి ఖాతాలో జమ అయ్యేలా చూడాలన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, మినుము పంటకు గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతు పండించిన పంటకు బోనస్ ధర నిర్ణయించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.